

# శ్రీవారి మోటారు

"హాస్యశ్రీ"

"రహదారి మూయబడినది"

అనేబోర్డు తగిలించారు మారోడ్డుకి రెండుచివర్లా. సంతోషించాను. ఎన్నో మహజర్లు పెట్టుకున్నాం; ఇంకా ఎన్నోవిధాల ప్రయత్నించాం. కాని అధికారవర్గాలలో ఏంచలనం కలగలేదు. శుష్కించిన బీదల ఎముకల్లా బయటపడ్డ కంకరాళ్లుగల మా రోడ్డు ఎందరికో కోపం తెప్పించింది; చిరాకు కలిగించింది; కన్నీళ్లు తెప్పించిందికూడా. అయినా ఇంతలో మా రోడ్డుకి కలగగల ప్రమాదం ఏమీ లేదని అధికార్లు అభిప్రాయపడ్డారు. పరిస్థితి ఇలా ఉన్నప్పుడు అనుకోకుండా మా రోడ్డుకి మరమ్మత్తు ప్రారంభించడం చూస్తే నాకు సంతోషం, ఆశ్చర్యం కూడా కలిగాయి. మేస్త్రీ నడిగాను. "ఏమీ తెలవనట్టు అడుగుతారేం బాబూ?" అన్నాడు. నా ముఖంలో ఆశ్చర్యం తగ్గకపోవడం గ్రహించి మళ్లీ అన్నాడు - "దొరగారు ఇల్లు మారారు కదండి; ఆరి మోట్రుకారు ఇసుమంటి రోడ్డుమీద ఎట్టా పోద్ది?"

అవునవును. ఈమాత్రం గ్రహింపుకు రాకపోవడం నాకు చిన్నతనమనిపించింది. శ్రీవారి మోటారుకారేమిటి, ఇలాంటి రోడ్డుమీద నడిపించడమేమిటి? అమానుషం. ఏ సూదిలాంటి కంకర్రాయో తగిలితే ఇహ ఆ టైరు ఎందుకు పనికొస్తుంది? అదేమైనా మానవ శరీరంలాంటిది గనకనా, దెబ్బ తగిలితే టించర్ అయొడిన్ వేసి మాన్పుకోడానికి! సున్నితమైన రబ్బరు చక్రమాయె. అసలు, ఇలాంటి ప్రమాదం ఏదో సంభవించి, శ్రీవారి మోటారుకారు మూలపడడం మా ప్రజానీకం ఏమాత్రం సహించదు.

ఈ ప్రేమ అసహజమైనదీ, అవ్యాజమైనదీ ఎంతమాత్రంకాదు. కారణాలున్నాయి.

శ్రీవారి మోటారుకు (సౌలభ్యానికి మోటారందాం.) ఒకకన్నుగుడ్డి. అంటే ఒక హెడ్ లైట్ వెలగదు. రెండోదానికి రేచీకటి. అయినప్పుడు శ్రీవారి మోటారు రాత్రుళ్ళు బయటికి కదలదు కాబోలు ననుకునేరు! అలా కాకపోగా, రాత్రి పన్నెండు కొట్టేదాకా దాని సంచార కార్యక్రమానికి విరామం లేదు-ఎందుకో మనకనవసరం-తస్మాత్, మాపురవీధులలోగల విద్యుద్దీపాలన్నీ దేదీప్యమానంగా వెలుగుతూ శ్రీవారి మోటారుకు దారి చూపిస్తాయి. శ్రీవారికి మోటారు రాక పూర్వం మాకీ సౌభాగ్యం లేదు. దీనితో చీకట్లో కుక్కల్ని తొక్కే అవకాశాలు తగ్గిపోయాయి.

శ్రీవారి మోటారుకు దుమ్ము, ధూళి అంటే కిట్టదు. అంచేత రోడ్లమీద విధిగా రెండుపూటలా నీళ్లు జల్లుతోంది మిషను. దీనితో ముక్కూనోటా దుమ్ము పీల్చే అవస్థ చాలవరకు తగ్గింది మా పట్టణవాసులకి.

శ్రీవారి మోటారుకు హారన్ ప్రత్యేకంగా అవసరంలేదు. కృష్ణానది వంతనపై పోయే రైలుబండిలా అది, మిగతా కార్లవలెగాక, ప్రయాణం సాగిస్తున్నంతసేపూ గంభీరమైన ధణంధణ ధ్వానంతో ప్రజలకి బహుపరాక్ చెబుతూనే వుంటుంది. ఈ పరోపకార పారీణతకి ఎంతోమంది పురజనులు జోహారులర్పించారు.

శ్రీవారి మోటారు "సైలెన్సర్" నిశ్వసించిన ధూమప్రభావానికి తాళలేక నశించిన క్రిమికీటకాదులు అసంఖ్యాకంగా వున్నాయని, ఈ మధ్య పట్టణంలో అంటువ్యాధులు తగ్గిపోవటానికి ముఖ్యకారణం ఇదే నని విశాఖపట్టణం నుంచి తిరిగి వచ్చిన ఓ "రిసెర్చి" విద్యార్థి ఎవరితోనో అంటుండగా విన్నాను.

శ్రీవారి మోటారు ఇద్దరు ముగ్గురు ఆశ్రితులకి పనిచెయ్యకుండా తిండి సంపాదించుకునే సదుపాయం కలగచేసింది. ఇది వాస్తవమే నని, దీనికి కారణం శ్రీవారు స్వయంగా మోటారు నడుపుతున్నప్పుడు అది చేసిన సాహసకృత్యాలే నని ఆ ఋణగ్రస్తులు స్వయంగా ఒప్పుకున్నారు.

ఇలాంటి బహువిధ గుణ సమన్వితమైన శ్రీవారి మోటారుకు నలుగురు బంట్రోతులు గలరు. ధగద్ధగాయమానంగా ప్రకాశించేలా దాన్ని మాలీసు చేయడం ఈ అంగరక్షకుల విధి. సదా దాని క్షేమం కోసం, అందంకోసం పాటుపడడమే వీరి అనుదినకృత్యం—

ఎలాగైతేనేం మా రోడ్డు బాగుపడ్డది. అదే మాకు కావలసింది. శ్రీవారి మోటారు తిరిగే ఇతర ముఖ్యమైన రోడ్లు కూడా కొన్ని బాగుపడ్డాయి. అయితే పూర్వజన్మ సుకృతం గల ఏ కొద్దిమందికో తప్ప అందరికీ ఇలాంటి చక్కని రోడ్లపక్క గల ఇళ్లలో నివసించే అదృష్టం ఎలా వుంటుంది మరి. అంచేత బుద్ధిమదగ్రేసరులైన మా పురజనులు కొందరు అహోరాత్రాలు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఎలాగైనా శ్రీవారి మోటారు మా వూళ్లో వున్న రోడ్లన్నీ పరామర్శించేలా చేయగలిగితే!... చక్కటి ఆలోచన; కార్యశూరులు కొందరు శ్రీవారి మోటారు డ్రైవరుతో సమాలోచనలు జరిపారు. అయితే వచ్చిన చిక్కేమి టంటే డ్రైవరు ఏమీ తెలివితక్కువాడు కాకపోవడం; అలావుండగా మీదు మిక్కిలి స్వామిభక్తి పరాయణుడు. అన్నాట్ట, 'బాగానే వుంది, కాని ఈ తిరుగుడు కయ్యే చమురుఖర్చు ఎవ రిచ్చుకునేట్టు?' పాయింటే. బాగుపడేది ప్రజలైతే మధ్య శ్రీవారికా అనుదం? అంచేత ప్రజలే చందాలు వేసుకుని ఈ సమస్య పరిష్కరించాలని కార్యభారం వహించిన నాయకులు సంకల్పించారు. సంకల్పించడం అయితే సంకల్పించారు గాని తీరా చేతులోకి వచ్చేటప్పటికి ఓ పెద్ద సమస్య ఎదురైంది. ఎవరెంత ఇవ్వాలి? రోడ్డెవరి కెంత ముఖ్యం? రోడ్డు సరిగా లేకపోతే ఎవరి కెక్కువ నష్టం? సైకిళ్లూ, బళ్లూ వున్నవాళ్లు మిగతా వాళ్లకంటే ఎక్కువ ఇచ్చుకోవాలని అవిలేని వాళ్లు తీర్మానించారు. ఇవిలేనివాళ్లే రోడ్డుమీద ఎక్కువసేపు నడుస్తారు గనుక వాళ్లే ఎక్కువ ఇచ్చుకోవాలని వాహన యోగం పట్టిన వాళ్లు అన్నారు. అంతే, ప్రతిష్టంభన ఏర్పడ్డది. పరిష్కారానికి ప్రయత్నాలింకా జోరుగా జరుగుతూనే వున్నాయి. భవితవ్యం నిరీక్ష్యము.

శ్రీవారు తమ మోటారు అమ్మేస్తారని ఈ మధ్య ఓ పుకారు బయల్దేరింది. ఇది చాలా అనర్థదాయకం. మా పట్టణ ప్రజాహితానికి పాటుపడే శ్రీవారి మోటారు పరాయిచోటికి వెళ్ళిపోవడం దుస్సహం. ఇది పుకారుగానే నిలిచిపోవుగాక! శ్రీవారి మోటారువల్ల కలిగే వుపయోగాల్ని పూర్తిగా వినియోగించుకునే బుద్ధిచతురతలు మాపౌరులకు దేవుడు ప్రసాదించుగాక! శ్రీవారి మోటారు మావూరు రహదారులన్నీ పర్యవేక్షించుగాక! ఇందుకు శ్రీవారి కయ్యే యావత్తు చమురుఖర్చూ భరించుకొనే శక్తి ప్రపత్తులు మాపురజనులకు ఆ పరాత్పరుడు అనుగ్రహించుగాక!

నాలుగో క్లాసు కుర్రాడు పాఠం చదువుతూ, "నాన్నా, చెప్పనలవి కాని ఐశ్వర్యం అంటే ఏమిటి?" అని అడిగాడు. "నల్లబజారులో సంపాదించిన లాభాలురా, అబ్బాయ్!" అన్నాడు తండ్రి.